క్లుప్తంగా

అధ్యక్షుడిగా భూంరెడ్డి



విద్యుత్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గం

సిద్దిపేటరూరల్: యూనైటెడ్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ రూరల్ సెక్షన్ అధ్యక్షుడిగా భూంరెడ్డి శుక్రవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధానకార్యదర్శిగా కరుణాకర్, కోశాధికారిగా రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భూంరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా, రాష్ట్ర శాఖల ఆదేశాల మేరకు ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్వామి, కనకరాజు, పర్శరాములు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా ఎల్లం



ఎల్లంకు నియామక పత్రం అందిస్తున్న రాజేశంగౌడ్

సిద్దిపేటరూరల్: కిసాన్ కాంగ్రెస్ నారాయణరావుపేట మండల ఉపాధ్యక్షుడిగా గుర్రాలగొందికి చెందిన బోయిని ఎల్లం నియమితులయ్యారు. శుక్రవారం మండల అధ్యక్షుడు రాజేశంగౌడ్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎల్లం మాట్లాడారు. తన మీద ఉన్న నమ్మకంతో పదవి అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. తన వంతుగా ప్రభుత్వం పథకాలను అర్హులైన వారికి అందించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పాతర్ల బాలయ్య, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు మెరుపుల శ్రీనివాస్, రవీందర్, సంజీవరెడ్డి, లక్ష్మణ్, రాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని తలారువానిపల్లె, వడ్లూరు, బేగంపేట, నర్సింహులపల్లె, దేవక్కపల్లె గ్రామాలలో సీసీ రోడ్లు, కంపౌండ్ వాల్, అంగన్‌వాడీ, మహిళా సంఘ భవనాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు

ప్రజాపాలన విజయోత్సవాలు

బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు 18 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. సన్నాలకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు.

జ్ఞాపికలు ప్రదానం

సిద్దిపేటజోన్: సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ కప్ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన వివిధ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. పుల్లూర్, ఎల్లయపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎల్లయపల్లి విజయం సాధించింది. ముంద్రాయి, రాజగోపాల్ పేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజగోపాల్‌పేట, ఎస్ఎన్ఆర్ కింగ్స్, ఫ్రెండ్స్ ఐకాన్ జట్ల మధ్య జరిగిన పోటీలో కింగ్స్ గెలిచింది. మోహిన్ పూర, యువసేన జట్లు తలపడగా యువసేన గెలుపొందింది. విజేతలైన జట్టు క్రీడాకారులకు కాంగ్రెస్ నాయకులు ఆనంద్ మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



చంద్రమౌళిని సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడు వొడ్నాల చంద్రమౌళికి డాక్టరేట్ ప్రదానం చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ శ్రీ రామానంద తీర్థ మరాఠ్వాడ యూనివర్సిటీలో ఫైనాన్షియల్ పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ యూజింగ్ కెమెల్స్ మోడల్ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ తులనాత్మక అధ్యయనం అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. ఈ మేరకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది చంద్రమౌళిని సన్మానించి అభినందించారు.

కేసీఆర్ బొమ్మే కారణమా?

- ఏడాదిగా పంపిణీకి నోచని కుట్టుమిషన్లు
- పాఠశాల గదిలోనే మూలన పడిన వైనం
- గతంలో మైనార్టీ కార్పొరేషన్ కింద యూనిట్లు మంజూరు

కుట్టు మిషన్లు నిరుపయోగంగా మారాయి. కుట్టు మిషన్ల యూనిట్లు పాఠశాలలోని గదిలో మూలన పడేశారు. మైనార్టీ కార్పొరేషన్ కింద కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఇవ్వాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా యూనిట్లు మంజూరు చేసింది.. పంపిణీ చేసే లోగా ఎన్నికల కోడ్ రాగా ఆగిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు దృష్టి సారిస్తుందని మహిళలు ఎదురుచూస్తున్నారు. అయితే మిషన్లపై కేసీఆర్ బొమ్మ ఉండటంతో ఆపేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.



పాఠశాల గదిలో ఉన్న కుట్టుమిషన్లు

హుస్నాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ కింద హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్లు మంజూరు చేసింది. ఇందులో హుస్నాబాద్ టౌన్‌కు 65, హుస్నాబాద్ మండలానికి 5, అక్కన్నపేట 5, కోహెడకు 5 మొత్తం 80 కుట్టుమిషన్ల యూనిట్లు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా హుస్నాబాద్ ప్రాంతంలో పంపిణీకి బ్రేక్‌లు పడ్డాయి. ఆ కుట్టు మిషన్లను అధికారులు పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఓ గదిలో భద్రపరిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుట్టు మిషన్లను పంపిణీ చేయకుండా నిరుపయోగంగా వదిలేశారు. ఈ కుట్టుమిషన్ల పై అప్పటి సీఎం కేసీఆర్ ఫొటోను ముద్రించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన ఫొటోతో ఉన్న కుట్టు మిషన్లను పంపిణీ చేయకుండా అధికారులు నిలిపేశారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

మహిళలు ఎదురుచూపు

ఏడాదిగా కుట్టు మిషన్లు వస్తాయని, ఉపాధి దొరుకుతుందని ముస్లిం మహిళలు ఎదురుచూస్తున్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో వారి పేర్లు చూపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో మాత్రం పంపిణీకి నోచుకోవడం లేదు. నిరుపయోగంగా ఉంచితే అవి తుప్పుపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు మహిళలకు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదేశాలు వస్తే పంపిణీ చేస్తాం

గత ఏడాది మైనార్టీ కార్పొరేషన్ కింద ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. ఆ సమయంలో ఎన్నికల కోడ్ వల్ల పంపిణీ చేయలేదు. మైనార్టీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే కుట్టు మిషన్లు పంపిణీ చేస్తాం.

– షేక్ హైమద్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి



గోశాల వద్ద దీపకాంతులు

దీపోత్సవం.. నేత్రపర్వం

కార్తీక దీపారాధనలతో నాచగిరి పరిఢవిల్లుతున్నది. శుక్రవారం ఆలయ గోశాల వద్ద సామూహిక కార్తీక సహస్ర దీపోత్సవం కనులపండువగా జరిగింది. గోమాత, లేగదూడ చిత్రం గీసి.. చుట్టూ కార్తీక దీపాలు వెలిగించారు. వర్గల్(గజ్వేల్):

రాజీయే రాజమార్గం

14న లోక్‌అదాలత్ : జడ్జి కృష్ణ తేజ్



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్: చిన్న చిన్న కేసులు పెరుకుపోతున్నాయని, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని అదనపు సివిల్ కోర్టు జడ్జి కృష్ణ తేజ్ అన్నారు. కోర్టు హాల్‌లో వచ్చే నెల 14న నిర్వహించే లోక్‌అదాలత్ కార్యక్రమంపై శుక్రవారం పోలీస్, ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆయన కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కక్షిదారులకు ఇష్ట ప్రకారం రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు కోర్టు చుట్టూ తిరుగుతూ, సమయం, డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ఇద్దరికి న్యాయం జరుగుతుందని అన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నా రెడ్డి



మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జోత్స్నా రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో నాసిరకం మధ్యాహ్న భోజనం అందిస్తే క్షమించేది లేదంటూ విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నా రెడ్డి హెచ్చరించారు. కొండపాకలోని మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన సరుకుల గదిని పరిశీలించారు. అనంతరం భోజనం సరిగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందేలా చూసుకోవాలన్నారు. భోజనం వండే కార్మికులు శుచి, శుభ్రతలను పాటించాలన్నారు. డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. భోజనం సరిగా లేకుంటే చదువు ఎలా వంటబడుతుందంటూ ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీని ప్రశ్నించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేస్తూ మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎల్లయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కార్యకర్తలకు ఏ చిన్నకష్టం వచ్చిన అండగా ఉంటానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన సీఎం కేసీఆర్ వీరాభిమాని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. తనపై నమ్మకంతో గెలిపించుకున్న కార్యకర్తలు, నాయకులకు తన తుదిశ్వాస విడిచేంత వరకు అండుబాటులో ఉంటానన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, శ్రీకాంత్, భూంరెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్, మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన తప్పనిసరి



సాగుపై అవగాహన కలిగిస్తున్న ఉద్యాన శాఖ అధికారి రమేశ్

దుబ్బాక: ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కలిగి ఉంటే సత్ఫలితాలు దక్కుతాయని ఉద్యానవన శాఖ అధికారి రమేశ్ తెలిపారు. మండల పరిధిలోని బండారుపల్లిలో ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం రైతులకు ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలతో మరింత ఆర్థిక ఆదాయం సాధించవచ్చన్నారు. నీటి వనరులున్న రైతులు సాగుపై ఆసక్తి చూపాలన్నారు. మొక్కలకు, డ్రిప్ పరికరాలకు రాయితీలు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో రైతులు కనకయ్యగౌడ్, సత్యలింగం, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దిష్టి తాడు మెడకు బిగుసుకొని ఆవు మృతి



వర్గల్(గజ్వేల్): మెడకు కట్టిన దిష్టి తాడే ఆవు పాలిట మృత్యుపాశమైంది. కాలి గిట్టలో ఇరుక్కుపోయి, మెడకు బిగిసి ఊపిరాడక దుర్మరణం చెందింది. ఈ ఘటన వర్గల్ మండలం మజీద్‌పల్లిలో శుక్రవారం వెలుగుచూసింది. మజీద్‌పల్లికి చెందిన లింగ లక్ష్మయ్య–నర్సమ్మ దంపతులు.. సంకరజాతి పాడి ఆవును పోషించుకుంటున్నారు. ఇది రోజూ ఎనిమిది లీటర్ల పాలు ఇస్తోంది. దిష్టి తగలకూడదని దిష్టి తాడు కట్టారు. గురువారం రాత్రి రోజూలానే పొలం వద్ద కట్టేసి దంపతులు ఇంటికొచ్చారు. మెడ వద్ద దురద కలిగిందేమో వెనక కాలి గిట్టలతో గోకే ప్రయత్నం చేసింది. అందులోనే తాడు ఇరుక్కుంది. వదిలించుకునే ప్రయత్నంలో మెడకు మరింత బిగుసుకుపోయి ఊపిరాడక మృతిచెందింది. శుక్రవారం ఉదయం పాలు పిండేందుకు వెళ్లిన దంపతులకు విగతజీవిగా కనిపించింది. ఆవు మృతిచెందడంపై తట్టుకోలేక నర్సమ్మ కన్నీరుమున్నీరైంది.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



విద్యార్థులతో సీఐ శ్రీను

సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదవాలని సీఐ ఎల్.శ్రీను అన్నారు. శుక్రవారం ఆకునూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లితండ్రుల కష్టాన్ని గ్రహించి తలదించుకుని చదివితే జీవితకాలం తలెత్తుకొని బతకవచ్చన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అవసరముంటే తప్ప సోషల్ మీడియాను వాడొద్దన్నారు. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమని, సక్రమ మార్గంలో వెళ్లేవారు ఉన్నత స్థితికి వెళ్తారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వివరాలు తెలపొద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, తెలిసి తెలియని వయసులో ప్రేమ పెళ్లి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. తరగతి గదుల్లో అందరితో కలిసి మెలిసి ఉండాలని హితవు పలికారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత క్లాస్ టీచర్ లేనిపక్షంలో హెచ్ఎంకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీం బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు



రాయికోడ్‌లో..



మద్దూరు(హుస్నాబాద్): అరెస్టయిన బీజేపీ నేతలు



కోహెడ(హుస్నాబాద్)లో..

తెలుగు సంక్షేమ భవన్ ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులు పోలీసులు ఎక్కడికక్కడా ముందస్తు అరెస్టు చేశారు. సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకొని ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని బీజేవైఎం జిల్లా నాయకులు అన్నారు. సమస్యలను ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

– నెట్ వర్క్

సంక్షిప్త వార్తలు

◆ **పలువురికి పరామర్శ**



సిద్దిపేటరూరల్: ఇటీవల నారాయణరావుపేటలోని కొమిరే రాజు తల్లి, కుమ్మరి కిషన్ తల్లి మరణించగా వారి కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. అంతకుముందు గ్రామంలో ఫర్టిలైజర్ షాప్‌ను ప్రారంభించి, రాఘవాపూర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తిరుపతికి చికిత్స జరగగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): 15 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డి మండల వనరుల కేంద్రం వద్ద కర పత్రాలను ఆవిష్కరించారు. గత ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఏడాది క్రితం వరంగల్‌లో చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగుల శిబిరంలో తాము అధికారంలోకి వస్తే ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అప్పుడు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు.

◆ **రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

మద్దూరు(హుస్నాబాద్): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సన్న, చిన్నకారు రైతులైన ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బోరుకు రైతులతో కలిసి ఆయన ఎంపీడీఓ రామ్మోహన్‌కు దరఖాస్తులను అందించారు. ప్రభుత్వం ఎస్టీ సామాజిక వర్గానికి అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు బదావత్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

◆ **ప్రజాసంకల్ప దీక్షకు తరలిరండి**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోరుతూ చేపట్టనున్న ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి పిలుపునిచ్చారు. శనివారం అంగడి బజార్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ దీక్షకు అన్ని గ్రామాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు, మహిళా నేతలు, యూత్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమంలో కుల సంఘాలు కీలకపాత్ర పోషించాలని కుల సంఘాల జేఏసీ ప్రతినిధి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లిగారి యాదగిరి, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు.

◆ **ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ**



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఎర్మని రామస్వామి, అబ్బనమైన భద్రయ్య, బేగంపేటలోని నీల కరుణాకర్ కుటుంబాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, నాయకులు అయితం శ్రీనివాస్, ఎర్మని దుబ్బరాజం, ప్రతాప్, అంజయ్య, రజిని, చందు, ప్రశాంత్, రామచంద్రం పాల్గొన్నారు.

◆ **చెకుముకిలో విద్యార్థుల ప్రతిభ**

సిద్దిపేటరూరల్: సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకిముకి సైన్స్ టాలెంట్ టెస్టులో ఆర్డీఎఫ్ మాటిండ్ల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ నర్సింగోజు విష్ణుమూర్తి శుక్రవారం తెలిపారు. 10వ తరగతికి చెందిన అహ్మది అన్సారి, 9వ తరగతికి చెందిన సింగరి తేజశ్రీ, 8వ తరగతికి చెందిన సానియాలు ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థినులను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు**

కోహెడరూరల్(హుస్నాబాద్): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎంఈఓ పద్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరాములపల్లి.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నిమ్మకంటి వెంకటేశ్వర్ పదవీ విరమణ సన్మాన సభకు హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా శ్రీరాములపల్లిలో పని చేసి విద్యార్థులు, గ్రామస్తుల మన్ననలు పొందారని కొనియాడారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాణతలన్నారు.

◆ **ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి**

వర్గల్(గజ్వేల్): అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామన్న ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గల్ భవితకేంద్రం వద్ద ఉద్యోగులతో కలిసి వారు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో డిసెంబర్ మొదటి వారంలో సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. నిరసనలో సంఘ ప్రతినిధులు కరుణాకర్, భూపాల్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణంలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 32 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం న్యాయమూర్తి వారికి రూ.47,500 జరిమానా విధించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

◆ **పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం**



హుస్నాబాద్‌రూరల్: పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరంలాంటిదని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు అన్నారు. శుక్రవారం మడదలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ఆరోగ్యశ్రీని రూ.10లక్షల వరకు పెంచిందన్నారు. అదనంగా వైద్య ఖర్చులకు కూడా సీఎం సహాయ నిధి నుంచి సహాయం అందిస్తోందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి 250 పడకలకు అప్ గ్రేడ్ కాబోతోందన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990